# చరమరాత్రి

*(నరకం, భూమి, స్వర్గం అనే మూడు కాలాలలో ఆలాపన)*

## న ర క ం

*రాత్రి పదకొండు గంటలయింది. ఇంకొక గంట. ఇంకొక్క అరవై నిమిషాలు. సరిగ్గా పన్నెండు కాగానే చచ్చి పోదలచుకున్నాను. అన్నీ ఆలోచించుకున్నాను. ఇప్పుడా? ఆరు నెలలనుంచీ నా కిదే ఆలోచన. ఆరునెలలనుంచీ సిద్ధమవుతున్నాను. ఇప్పటిదా యీ నిశ్చయం. ఆరు నెలల కిందటే తెగించాను. అప్పటినుంచీ నాకిదే ఆలోచన. నిశ్చయాన్ని మార్చుకుందామనికాదు. ఆరునెలలు అహో రాత్రాలు జాగ్రత్సుషుప్తులలో ఎడతెగని యోచనా తరంగా లలో నా నిశ్చయాన్ని స్నానం చేయించాను. ఆరునెలల అవభృథ స్నానంలో పవిత్రీకృతమైన నా అందమైన, నా ఆడుకునే, నా తిరుగులేని, భయంకరమైన సంకల్పాన్ని ఈ రాత్రి ఆచరణలో పెడుతున్నాను.*

ఈ రాత్రి నా ఆత్మహత్యా మహోత్సవం. ఇది ఆహ్వాన పత్రికకాదు. ఈ ప్రదర్శనకి ప్రేక్షకులు అనవసరం. ఇది నా సొంత వ్యవహారం. ఇతరులు లోనికి రాకూడదు.

మరణించాలని నిశ్చయించుకున్నాను. సరిగ్గా ఈ రాత్రి పన్నెండుగంటలకి చచ్చిపోవాలని సంకల్పించుకున్నాను. "ఈ రాత్రి పన్నెండు కాగానే. ఈ రాత్రే ఎంచేత? పన్నెండుకే ఎందువల్ల? అసలు చచ్చిపోవడం ఎందుకు? చచ్చిపోతూన్న ఓ వ్యక్తీ! నువ్వెవరు?"

నేనెవరు? అనవసరం. అయితే ఈ రాతకూడా అనవసరమే? పోనీ నే నెవరో ...ప్పనా? ఎవరికి చెప్పను? ఎందుకీ రాత? అదే. ఈ రచన ఎందుకో. ఎవరికో ...కుందామని చచ్చిపోతున్నాను. ఆరు నెలలుగా చచ్చిపోతున్నాను. ప్రతీదినం ఆధ్యాత్మికంగా ...యాను. ఈ రాత్రి భౌతికంగా. త్వరలో నేను చెయ్యబోయే ఆఖరు అభినయం నా ...కి ఫుల్‌స్టాప్. నా కావ్యానికి పరిసమాప్తి.

...వితాన్ని అర్థం చేసుకోవడానికి జీవించటమే అవసరం అనే సునాయాసపు సూత్రం ...ంచి మరణం ఇందుకు నా మార్గంగా ఎంచుకున్నాను. ఇది ఎవరికీ బోధపడదు. ... బోధపరచలేననికూడా నే నెరుగుదును. అయినా నా ఈక్వేషన్ కిదే సొల్యూషన్. అదే పొరపాటు. నేనొక రచయితననీ, రాతలో ప్రకాశించలేక చచ్చిపోతున్నాననీ అనుకోవద్దు. ఈ చేతులతో నా ఎనిమిది వందల పేజీల నవలని దగ్ధం చేశాను. నాకు రాత చేతకాదని ఎవరూ అనరు. నేనసలే అనుకోలేదు. కీర్తిదాహం తీరకపోవడం నా ఆత్మహత్యకి కారణం కాదు. ప్రేమలో పరాజయం కారణం కాదు. ధనాభావం అంతకన్నా కారణం కాదు.

ఎంచేతనంటే! మా నాన్నకి బోలెడంత ఆస్తి ఉంది. పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు? రెండు చేతులా ఆర్జిస్తున్నాడు. *(లంచాలంటావా? అనుకో)* నేను ప్రేమించిన స్త్రీ నన్ను అంగీకరించింది. మా వివాహం విషయంలో మా తల్లిదండ్రులు మాకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చారు. నన్ను ప్రేమిస్తున్న అమ్మాయికి అందమూ, చదువూ, డబ్బూ, తెలివీ ఉన్నాయి. జీవించాలనుకుంటే రేపే ఆమెను పెళ్ళి చేసుకో గలను. నా వయస్సు 24 ఏళ్ళు. నా బదుకంతా ముందే వుందని నాకెవరూ చెప్పనక్కరలేదు. నాకే కీర్తి కావలిస్తే నా నవల ప్రకటించి ఉందును. నేను రచయితనే కాదు. చిత్రకారుణ్ణి. నా చిత్రాలు ప్రదర్శించి ఉందును. *(వాటినికూడా నాశనం చేశాను. కాని అంతకన్నా మంచివి చిత్రించగలను.)* నేను చిత్రకారుణ్ణి మాత్రమే కాదు. నాకు సంగీతం కూడా వచ్చును. వయోలిన్ వాయిస్తాను. క్రికెట్, టెన్నిస్, ఫుట్‌బాల్ ఆడతాను. నాకు మానవమాత్రుడు కోరుకోదగ్గవన్నీ ఉన్నాయి. నన్ను తెలిసిన వారంతా నాకేమీ లోపం లేదంటారు.

నేను మెడికల్ కాలేజీలో చదువుకుంటున్నాను. ఈ వివరాలన్నీ అనవసరం. సరదాగా చదువుకోవడానికి కథ రాయడం లేదు నేను. పన్నెండు గంటల కోసం కాచుక్కూచున్నాను. ఈ లోపున ఏం చేయడానికీ తోచక ఇది రాస్తున్నాను. ఆరునెలల నా ఆలోచనల సారాంశం. పదకొండుగంటల యాభైతొమ్మిది నిమిషాలకి ఈ రాసినదంతా ఈ వెలుగుతున్న కొవ్వొత్తికి అప్పగిస్తానేమో. ఈరోజే మా నాన్న పంపించిన రెండువందల రూపాయలు ఈ కొవ్వొత్తికే ఇచ్చివేసినవాణ్ణి కానూ నేను!

విద్యుద్దీపాలున్న ఈ గదిలో ఒక కొవ్వొత్తిని మాత్రం వెలిగించి కూచున్నానంటే, నా టేబిలుముందు కాయితాలూ, కలం పెట్టుకొని కూచున్నానంటే, ఒక చేతురుమాలూ, ఒక సిగరెట్టుపెట్టె పెట్టుకొని కూచున్నానంటే చేతిగడియారాన్ని వెల్లకిలా పడుకోబెట్టి కూచున్నానంటే, సీసా ఒకటి ఎదురుగుండా ఉంచి...

బ్రాందీ? తప్పు. విషం? తప్పు. రైట్. అదే! క్లోరోఫారం! చూశావా మరి? నేనేమీ ఆలోచించకుండా చెయ్యను. నూతిలోపడి ఉక్కిరి బిక్కిరిగా, ఉరి పోసుకుని నాలుక వేలాడుతూ, విషంతాగి కడుపు దహించుకునిపోయి, రైలుబండికింద ముక్కలైపోయి...ఈ చావులేవీ నాకు మనస్కరించవు.

నిద్రపోతూ, కలలుకంటూ, అపస్మారంలో హాయిగా, అందంగా కరిగిపోయి సురిగిపోతాను. చావుబదుకుల సరిహద్దును తుడిచివేస్తాను. హఠాత్తుగా అనాయాసంగా చచ్చిపోవడానికి కూడా వీళ్ళున్నాయి. ఎలెక్ట్రిక్‌షాకుతో, ఎత్తునుంచి దుమికి కణత రివాల్వర్‌తో కొట్టుకుని పన్నెండు ఔన్సుల గాజుగ్లాసులో పది ఔన్సుల నీళ్ళుపోసి చిటికెల *(అంత అనవసరం)* సైనైడ్ కరిగించి చిటికెన వేలుమీద బ్లేడుతో గంటుపె వేలు ద్రవంలో ఉంచితే చాలును. నా హైపొడెర్మిక్ సిరింజిని వాడినా చాలున ఇవేమీ నాకు తృప్తి కలిగించవు. నా సంగతే వేరు. నా సంగీతం వేరు. హ అందంగా స్వప్నాలతో...అదీ నా రకం.

చిత్రంకాదూ? ఇదివరకు. ఆరునెలల క్రితం, ఎప్పుడో ఆరునెలల కిందట క్రీస్తుపు ఆరునెలల వెనుక, భూమి పుట్టిన ఆరునెలలకు ముందు, అప్పుడు ఆ రోజుల్లో జీవితమంటే ఆప్యాయంగా, ఊపిరి తియ్యడమే మహద్భాగ్యంగా, సుందరదృశ్యాలు చూస్తూ, సుందర గ్రంథాలు చదువుతూ, రాస్తూ, గానం చేస్తూ, బొమ్మలు చిత్రిస్తూ, నేను ప్రేమించిన నన్ను ప్రేమించిన ప్రేమను ప్రేమిస్తూ, జ్ఞానాన్ని మధిస్తూ, వెయ్యి చేతులతో, వెయ్యి ఇంద్రియాలతో జీవిత మాధుర్యమంతా తనివి తీరా పీల్చిన విసుగు లేకుండా

అనుభవించిన....లేదా పిల్చినట్లు. అనుభవించినట్లు భ్రమించిన నేను. నేడు, ఈనాడు, నేటికి, ఈనాటికి, అన్ని ఆశయాలూ అడుగంటి, ఐహిక యాత్రలో ఆకర్షణపోయి, ఒకానొక క్రూరమైన క్రోధావేశం పుట్టుకొచ్చి ఎంత వేగం ఈ వికార నటనానికి పరిసమాప్తి చెబుదామా, ఎంత శీఘ్రం ఈ నికృష్ట దృశ్యాన్ని చెరిపివేద్దామా అని తహతహ, ఆవేదనా, ఆందోళనా పొందడం అమ్మయ్యో నాకే ఆశ్చర్యం! ఓహో ఆశ్చర్యం! ఆశ్చర్యం, నాలో నాకే ఆశ్చర్యం కలిగిస్తోంది.

కాని నేనేం చెయ్యగలను? ఇంకేం చెయ్యను? ఏం చెయ్యమంటావ్? ఏం చేదాం అనుకున్నా ఎదురుగుండా. ఏం లాభం! అనే ప్రశ్న అటకాయిస్తుంది. ఎన్ని విధాల యోచించినా మృత్యువు ఆవశ్యకమై, కౌగలించుకొనే స్నేహితుడిలాగ, ఆదరంగా ఓదార్చే బంధువులాగ ఆహ్వానిస్తూ వివృత కవాటమై స్వాగత తోరణాలు ధరించిన దివ్యభవనంలాగ కనబడుతూ, జీవితం భయంకరమై, దుస్సహమై దుష్టమై, విహ్వాలభావం సోకించి, శత్రువై, సర్పమై, శార్దూలమై, శాపమై రావద్దనే రాక్షసిలాగ, పోపో అనే పొగలాగ కనబడుతూవుంటే వినబడుతూవుంటే ఆహ! నా నిశ్చయం, ఔరా! నా నిర్ణయం ఇంకోలాగ ఎలా వుంటుంది?

చనిపోవాలని నిశ్చయించుకున్నాను. చిత్రం కాదూ? ఏడాది కిందట నా స్నేహితుడు, డబ్బు లేక చదువుమాని పనిలో ప్రవేశించి, సంసారంలో ప్రవేశపెట్టబడి, బదుకువల్ల లారీ చార్జి చెయ్యబడి కరువువల్ల నిలువుదోపిడి చెయ్యబడిన నా స్నేహితుడు ఏడాది కింద కనబడి నన్నొక మహోపకారం. చిటికెడు పొటాసియం ఫెర్రోసైనైడ్, చిత్రం! స్పెల్లింగు తప్పుతో రాసినమాట. సగం మూసిన కళ్ళతో ప్రార్థిస్తూవున్న నా స్నేహితుడు, కాగితాన్ని నా చేతిలో పెట్టి *(కోరిన వస్తువును నోటితో చెప్పలేక)* ఒకే ఒక్క మహోపకారం చెయ్యమని, ఆఖరికోరిక చెల్లించమని ప్రాధేయపడితే, ససేమిరా అని నేను పట్టుబట్టి, ఇవ్వనుగాక ఇవ్వనని భీష్మించుకొని, ప్రాణపు పావిత్ర్యం గురించి, జీవిత సౌభాగ్యం గురించి కవిత్వపు గమకాలతో ఉపన్యాసం ఇచ్చిన నేను, అతని కథంతా విని, ఎన్నో మార్గాంతరాలు చూపించి, ఎన్నో దృష్టాంతాలు బోధించి, బదకవలసిన అవసరం రుజువు చేసిన నేను, పరాజయ మెరుగని జీవితపు పతాకాన్ని అతని మనస్సులో ప్రతిష్టించిన నేను *(నాకు జ్ఞాపకం, బ్రౌనింగ్ కవి* Saul *అనే గీతం నుంచి* Oh, Our manhood's prime vigour!... ...oh' The wild joys of living! *ఇత్యాది పాదాలు, బైరన్ రాసిన* "To sit on rocks" మొదలైనవి - *అదంతా ఇక్కడ ఉటంకించటం అనవసరం - నా వాదానికి వాటికి స్తంభాలుగా* చేసిన నేను) - ను *(ఈ వాక్యాన్ని ఇంతటితో పూర్తి చెయ్యాలంటే)* అతణ్ణి బతికించాను. అతని కిప్పుడు కొడుకు! అతని కిప్పుడెంతో మర్యాద! ఎంతో హాయిగా ఇప్పుడతడు జీవిస్తున్నాడు. ఇక నేను! ఎప్పుడు ప్రవేశించిందో నా మనస్సులో ఈ కీటకం! *(ఆరు నెలల కిందట* ఎలా ప్రవేశించిందో ఈ క్రిమి! నాకు తెలియకుండా కాబోలు, ఎన్ని పద్మవ్యూహాలు, సాలీడు గూళ్ళు, ఎన్ని అంధకార గుహాంతరాలు చొరబడ్డానో, ఎన్ని ఇంద్రజాలాలు , ఎన్నిమార్లు పునఃపునఃపునః పరీక్షలు చేసుకున్నానో నా హృదయ హృదయ హృదయాంత రాంత రాంత రాళాలలో! ఎన్ని ప్రశ్నలు, ఎన్ని సంజాయిషీలు! ఎన్ని రాజీలు, చిరాకులు, కోపాలు, తాపాలు, సందేహాలు! ఓహో, ఆ సందిగ్ధాల సంధ్యాసమయంలో నన్ను నేనే ఎన్నో మార్లు చిత్రవధ చేసుకున్నాను. ఎంత యమయాతన పడ్డానని!

అడుగడుగునా ఎవరో వెనకనుండి తరుముకు వస్తున్నట్లుండేది. ఏదో కొండ చిలువ నన్ను చుట్టకున్నట్లుండేది. కారు కమ్మిన పొగలు తుపాను పెట్టినట్లు ఉక్కిరి బిక్కిరి కలిగేది. ఇక నా మెదడులో హోరు చెప్పనక్కరలేదు. సంగీత విరుద్ధమైన వివిధ శబ్ద

సమ్మేళనలతో, వాటిలోనే వివిధ విచిత్రలయలతో, అవ్యక్త భీతావహంగా వినిపించే ధ్వనులు, కథలలో చెప్పుకునే, మనస్సులో ఊహించుకునే, మానవుడి భయం నాటినుండీ నేటివరకూ ధరించే రకరకాల రూపాలూ, వికారపు కోరలూ, కొమ్మల కొమ్మల కొమ్ములూ, అనేక వక్త్రాలూ, ఒంటినిండా ముళ్ళూ, నాసారంధ్రాల నుండి అగ్నులు కక్కే జంతువులు నన్ను ముట్టడించేవి. అర్థంలేని పైశాచిక మంత్రాలు నా నిద్రకి భంగం కలిగించేవి. నల్లని వర్షమేఘాలతో నా మానసిక వ్యోమమంతా చాందినీ కప్పేవి.

ఎక్కడిదా అంధకారం? ఫ్లెమిష్ చిత్రకారుల వర్ణలేపనంలో, బోదిలేర్, రాన్‌బో కవుల సంక్షోభ కవిత్వంలో, డీ క్విన్సీ నల్లమందు పొగలలో, డీన్‌స్విఫ్ట్ మానవద్వేషంలో, షోపెన్హార్ తత్వజిజ్ఞాసలో, బిథోవెన్ కళ్ళవెనక, దోస్టవస్కీ గ్రంథపుటలలో, ఎడ్గార్‌పో ఆత్మలో, దండక, ఆఫ్రికా అరణ్యాలలో, సైబీరియా ఎడారులలో, ఉత్తర ధ్రువ రాత్రుల మంచుకప్పిన మైదానాలలో ఎక్కడనుండి వచ్చిన అంధకారం అది?

నా చీకటిలో గిలగిల కొట్టుకుంటూ, సూదులవంటి, బాణాలవంటి భావాలతో, తప్తతైల ప్రవాహాల నిరంతర స్నానంలో, పగిలిన అగ్ని పర్వతాల ప్రచండార్భాటంలో, ప్రకోపించిన పంచభూతాల నిరంకుశ పరిపాలనలో, గగన చుంబకములైన మహా తరంగాలు ఘూర్ణిల్లే ప్రళయ సముద్రాలతో నా మెదడంతా అల్లకల్లోల మయ్యేది.

చచ్చిపోతున్న ఓ వ్యక్తీ! చాలించు ఇక నీ సరదారాత! చస్తానని ఎవరిని జడిపిస్తావు? చాలా చూశాం ఇలాంటివి. ఈ కార్యం చేసేవారెవరూ ఇన్ని తర్జన భర్జనలు చెయ్యరు. ఒక్కక్షణంలో ముగించుకుంటారు. నూతిలో వురికీ, సముద్రంలో పడీ, విషంతాగీ, ఉరిపోసుకొనీ, ఎత్తునుండి దుమికీ, ఎలెక్ట్రిక్ షాక్‌తో ఎట్‌సెట్రా! జాబితాలనవసరం. ఒక లక్ష మార్గాలున్నాయి. ఏదైనా స్వీకరిస్తారు. నీలాగనుకున్నావా?

లేదు. చాలా ఆలోచిస్తారు. నాలాగే! చాలా వితర్కిస్తారు. నాలాగే. నాకు తెలుసును. మరణించడం అంటే నిండుప్రాణం హరించి పోవడమంటే మీదమీద లేదు. మరణశిక్ష విధించబడినవాడు కూడా ఇష్టంగా ఉరికొయ్య ఎక్కడు. ఎంతోమంది ఉరి తీయబడేముందు తమ్ము తీసుకువెళ్ళుతూన్న వాళ్ళతో కాట్లాడి, వాళ్ళని రక్కి, కరిచి, విలవిల లాడుతారు. దీర్ఘరోగుల్లు కూడా సులువుగా చచ్చిపోరు. సమీపించే మృత్యువును ప్రతి రక్తకణంతోనూ ఎదుర్కొంటారు. వైద్యులు కుదర్చలేక పెదవివిరిచిన అసహ్యమైన జబ్బులు మోసుకుంటూ ఎలాగైనా బతికివుండడం కోరతాడు ప్రాణి. మురికి కాలువలోని కుక్క కుళ్ళి కుళ్ళి చచ్చిపోతుంది. కాని, ఎంత తిండిలేకపోయినా, ఎంత వానలో తడిసి, ఎంత చలిలో కొంకర వారిపోయినా వెంటనే చచ్చిపోదు. ఎన్నో జననాలనీ, మరణాలనీ నేను దగ్గర ఉండి చూశాను. చూశావా మరి! నేను చచ్చిపోతున్నానంటే నిరాలోచితంగా పిరికితనం పెడసరం చేస్తున్నానని ఎంతమాత్రమూ అనుకోవద్దు. ఒక్కొక్క సంగతే జాగ్రత్తగా ఒక్కొక్క మార్గమే ఓపికగా అనుసరించి ఈ అమూల్యమైన నిరాశ నందుకున్నాను.

గట్టిగా గాలివేసి కొవ్వొత్తి ఆరిపోయింది. చీకట్లోనే ఆలోచిస్తూ అలా వుండిపోయా కొంతసేపు. మళ్ళీ దీపం వెలిగించి రాస్తున్నాను. ఇంకా పన్నెండు కాలేదు.

## భూ మి

అయితే ఏమంటున్నావ్, నేస్తం! నేను చచ్చిపోవడం ఏమీ సమంజసంగా లేదంటావు. నేను సజీవంగా ఉండడం సమాజ క్షేమానికి అవసరం అంటావు. నా బదుకు నాదికాదు

అది సంఘంలో ఒక భాగం. అదిపోతే సంఘ యంత్రం నడవదు. సమాజంలో నా స్థానాన్ని విసర్జించి పలాయన మవుతున్నానంటావు కదూ? ఉండు, ఉండు. ఆ స్థలం నిర్ణయమయిందా? ఆ విలువలు నిర్దేశించబడ్డాయా? నా స్థలాన్ని నేను వెదుక్కుంటూ ఉంటే ఎన్నిరకాల నిరోధాలు ఎదుర్కొంటున్నాయో ఎరుగుదువా? నా చుట్టూ ఎన్ని ముళ్ళకంచెలున్నాయో చూశావా? నన్ను వెలివేసి, సందేహించి, నేనంటే భయపడి, నన్ను అసహ్యించుకుని నన్ను హతమార్చడానికి చూసే ఈ ఇనపపద్ధతిమీద నాకేం గౌరవం ఉంటుంది? ఈ కుళ్ళిపోతూన్న సంఘం మర్యాదలను నేననుసరించగలనా? ఈ కపట నాటకంలో నా కిష్టంలేని పాత్ర వహించి ఎలా ఒప్పించగలను?

నేస్తం! నేటి ప్రపంచానికి తెలిసింది ఒక్కటే విలువ. ధనం! నా సంగీతాన్నీ, కవిత్వాన్నీ, చిత్రలేఖనాన్నీ ఎవరూ హర్షించరు. డాక్టరునై, వృత్తిలో దిగినప్పుడు కూడా, నా యిల్లూ, నా వేషమూ, నా మోటారుకారూ చూస్తారు కాని డబ్బు తీసుకోకుండా వైద్యం చేస్తానంటే వెర్రివాడికింద కట్టేస్తారు. ఎవరికి వారు, తమ తెలివితేటలనూ, జిత్తులనూ సామర్థ్యాలనూ డబ్బుకింద మార్చుకోడానికి ప్రయత్నించడం పరిపాటి. ధనార్జన ప్రధానమై, పరదైవమై, మానవులకు మహదాశయమై పోయింది. ప్రపంచ సమస్య అంటే ఆర్థిక సమస్య. మనుష్యుల విలవలు కొలవడానికి స్పష్టంగా కనిపించే కొలత ధనం కాక మరేముంది ప్రస్తుత పరిస్థితులలో? ధనంవల్లనే ఆధిక్యం కాబట్టి ధనోపార్జనకే ప్రతివ్యక్తీ పెనగులాడతాడు. ధనం మూల మిదం జగత్. వీడు గుడ్డి గవ్వ చెయ్యడు. మన సామెతలు మన దృక్పధానికి సాక్ష్యం. చెడిపోవడానికీ బాగుపడడానికీ భేదం ధనమే నిర్ణయిస్తుంది. ఏకాగ్రతతో తపస్సుచేసే యోగ్యుల లాగ కొందరు కుబేరుని వేదికముందు సహస్రనామ జపం చేస్తూనే వుంటారు. వడ్డీలు, లెక్కలు! వడ్డీలకు వడ్డీలు, జీవితమంతా డబ్బు పోగుచేసే యజ్ఞం. పెట్టుబడులెందుకు? వాణిజ్యం ఎందుకు? వణిజనీతి అంటారు. పాలలో అట్టే నీళ్ళు చేర్చవద్దు. బియ్యంలో ఎక్కువ రాళ్లు కలపవద్దు. నేతిలోఎక్కువ కొవ్వు కలపవద్దు. అసలీ కల్తీ చెయ్యడాలెందుకు? లాభం కోసం. వ్యాపారం. సాగడానికి, బంగారం, కాకి బంగారం, తినే తిండి, కట్టేబట్ట, కట్టడాలూ, కావ్యాలూ, చదువూ, సౌందర్యం అన్నీ అమ్మకానికి, సిద్ధం. అన్నిటికీ "సరసమైన"ధరలు. న్యాయమైన వ్యాపారం చెయ్యాలట. ప్రకటనలు! బొమ్మలతో, కరపత్రాలతో, గోడలమీద, విద్యుచ్ఛక్తితో, విమానాలనుంచి పకటనలు. దేశదేశాలలో ప్రచారం. దేశాలకు దేశాలే బజార్లు. వర్తకపు న్యాయం. వ్యాపారపు తాలు. సరుకు నమ్మకం. మా షాపులు చూడండి. ఒక్కమారు చూస్తే మరెక్కడికీ . వేశ్య అలంకరించుకొని ఆహ్వానించినట్లే. ఒకడు చెడితేగాని మరొకడు బాగుపడడట! కి కొని ఎక్కువకి అమ్మాలట! ఒక్కొక్కప్పుడు బజారు నాడి పరీక్షించి సామాన్లను గాచెయ్యాలట! అన్నిటికీ ఖరీదులు కట్టడం పరిపాటి అయిపోయింది. "ఏమండీ! లెంతకికొన్నారు!"..."అబ్బే! దగాపడిపోయారండి" ఒకడు కుళ్ళు వంకాయ లమ్మేస్తాడు. చెత్త పద్యాలమ్మేస్తాడు. వంద రూపాయలకి దమ్మిడీ లాభం హామీ యిచ్చే ం చూపిస్తే ధనంజయుణ్ణయి పోతానంటా డొకడు. పెట్టుబడిదారీ విధానానికి ంత్యకాలం ఆసన్నమయిందని వీళ్ళెవరూ కనుక్కోలేకుండా ఉన్నారేం? ఇంకా ఆ పాత వ్యవస్థనే పట్టుకుని ఊగులాడుతారేం? ఉత్పత్తి ప్రాథమిక దశలో వున్నప్పుడు వ్యక్తి సామర్థ్యానికి ప్రాముఖ్యం ఉండేది. ఇప్పుడో ఇది జూదంగా మారలేదూ! అంతా లాటరీ! అంతా గారడీ! ఎవడెప్పుడు గెలుస్తాడో తెలియదు. ఎవడెందుకు ఓడిపోతాడో తెలియదు. నేటి వ్యవస్థకొక నీతిలేదు. నియమంలేదు.

అందువల్ల ఈ జూదంలో నేను పాల్గొనలేను. పడిన శ్రమకు రూపాయి అణాపైసలతో లెక్క కడుతున్నప్పుడు పని ఎగగొట్టి ధనం సులువుగా ఆర్జించాలని ఉబలాటం కలుగుతుంది. పనిలో శ్రద్ధపోతుంది. అడుగు, ఈ ఉద్యోగస్తులందరినీ మీరు చేస్తున్న పనిలో మీకెంత ఆసక్తి ఉందని. "ఏమిటో, ఈ జీతపురాళ్ళకోసం కాకపోతే ఎవడిక్కావాలీ వెధవ ఉద్యోగం?" అంటారు.

ఏదో ఒక ఉద్యోగంలో తలదూర్చి, ఏదో ఒక వృత్తిలో బోర్డు కట్టి, అడుగునించీ ఆరంభించి అభివృద్ధికోసం పడిగాపులు పడుతూ జీవితాన్ని వెళ్ళబుచ్చడమేనా మానవుని పరమావధి? జీవితాన్ని ప్రచోదనం చేసే ఇతర శక్తులు. జీవితాన్ని ఆనందమయం చేసే ఇతరానుభూతులు మరేవీ లేవా? ఒకరినొకరు ద్వేషిస్తూ, తమ్ముతామే అసహ్యించుకుంటూ ఇంతేనా బతుకంటే! తానే చెయ్యగల పని తన మనస్సంతా పెట్టి చెయ్యడం, చేసినందువల్ల తాను ఆనందంపొందడం, దాని ఫలితం అందరినీ అనుభవించనివ్వడం ప్రస్తుత పరిస్థితులలో సాధ్యమవుతుందా? ఇది నాది అనుకోడం, దాన్ని దాచుకోడం, దానికోసం ఈర్ష్యపడడం, ఎంత వెర్రి మమకారం? ఉన్నత జీవితంలో ఈ విషాలు లేవు. ఒక కవి గీతాలు రాస్తే, ఒక వైజ్ఞానికుడు శాస్త్ర పరిశోధన చేస్తే, ఒక కళాకారుడు శిల్పం సృష్టిస్తే, ఆ ఫలం అంతా, సంఘం అనుభవిస్తుంది. సంఘం అంతా దాన్ని పంచుకుంటుంది. అందుకు అభ్యంతరం ఉండకూడదు. ఉంటే సమాజంలో ఇంకా కుళ్ళు నిలిచి ఉందన్నమాట. అందుకే మన దేశంలో వైజ్ఞానికుల కంటే బిచ్చగాళ్ళే ఎక్కువమంది.

సంఘంలో ఇంకా చాలా కల్మషం నిలిచిఉంది. కాబట్టే సంఘ కార్యాలన్నీ బాధల మధ్యా, కన్నీళ్ళ మధ్యా జరుగుతున్నాయి. అయితే ప్రపంచానికి అవసరమైన అల్పకార్యాలన్నీ ఎవరుచేస్తారు? అందరూ అందలం యెక్కితే మోసే వాళ్ళెవరు? సేవ్య సేవక ధర్మం. ఇదొక అభ్యంతరమే పూర్వం. అందుకే ఆ సామెత. ఇప్పుడు మనుష్యుల శ్రమ మానవుని బుద్ధిబలం వల్ల చాలామట్టుకు తగ్గిపోయింది. నేను సుఖంగా వుండడానికి నా నౌఖరును కష్టపెడతాననడానికి వీలులేదు. విద్యుచ్ఛక్తి నిన్ను సుఖపెడుతుంది. ఆవిరి నిన్ను సుఖపెడుతుంది. విజ్ఞానం నిన్ను సుఖపెడుతుంది. నీ సుఖాలను నీ సోదరులందరికీ పంచిపెట్టు. అందులోనే అనల్ప సౌఖ్యం ఉంది.

ఔను. ఈ ప్రపంచం మిథ్య అనీ, జీవితం దుఃఖ భూయిష్టమనీ అనేవాళ్ళను నేను లక్ష్యపెట్టను. ఈ విషాదాలన్నిటికీ నీ అజ్ఞానం కారణం. వీటన్నింటినీ తొలగించడాని వీలుంది. మనుష్యులకు సుఖించడానికి జన్మతః హక్కుంది. ధనికవర్గం ఈ సు దాచుకుంది. అలా దాచుకోడానికి వీలుగా నేటి పద్ధతి సర్వమూ నిర్మించబడింది వ్యవస్థను సమర్థించడానికి కూడా మన పండితులు కొందరు బయలుదేరుత ధనవంతులకే మరింత ధనం! వెనకబడినవాడు వెనకనే. దరిద్రుడుగా పుట్టడమే త వాడి కర్మం...అది వాడి పాపం.

ఒక గానసభగాని, ఒక నాటకంగాని జరుగుతూ ఉంటే ఇవతల నేను హాలుమీద రౌడీలు రాళ్లు విసరడం చూస్తాను. అంతా వాళ్ళని దుండగులని దు వాళ్ళేకాని నేను మాత్రం వాళ్ళ పక్షం వహించి వాళ్ళను అర్థం చేసుకుంటాను.. ఈ ధనికులంతా లోపల కూర్చుని కళాసామ్రాజ్యం పరిపాలిస్తున్నామనీ, వెలుపలినుంచి జరిగే అల్లరి తమ రసాస్వాదనకు భంగం కలిగిస్తున్నదనీ భావిస్తారు అంతేగాని శిల్పానికి వాయువువలె, జలంవలె సార్వజనీనమైన అనుభవయోగ్యత ఉన్నదని అంగీకరించరు. వీళ్ళ పోలీసులు రౌడీలను తరమడానికి సిద్ధంగా ఉంటారు. వెలుపలివారి హక్కునే లోపలివారు

అపహరిస్తున్నారని ఎవరు గ్రహించగలరు! తాము అనుభవిస్తూనే ఇతరులను కూడా అనుభవించనియ్యగల విశిష్టత ఉన్నత జీవితానికి లక్షణమని ఎంతమంది అంగీకరించ గలరు? ఇందుకా కవులు గ్రంథాలు రాసేది? గాయకులు గొంతుచించుకునేది? శిల్పులు చిత్రాలు సృష్టించేది? వైజ్ఞానికులు నూతన సత్యాలు కనిపెట్టేది?

కాని ఈ మహాశిల్పుల జీవితాలు కూడా ధనానికే అంకితం అయిపోవడం నాకు జాలి కలిగిస్తుంది. డబ్బు ఎంత క్షమించరాని నేరం చేస్తోంది! అమూల్యమైన రసాత్మలను కొనేస్తుంది. అందమైన భవనాన్ని చూస్తే దీన్ని కట్టినవాడు ఎంతో కొంత డబ్బు తీసుకున్నాడన్న సంగతి నేను స్మరించడం మానలేను. మువ్వగోపాలపదాన్ని అమోఘంగా అభినయిస్తున్న అమ్మాయి హస్తముద్రల వెనక ధనంచేసే కరాళ నాట్యాన్నే చూస్తాను. ఒక గొప్ప నాటకకర్త సృష్టించిన పాత్రను ఒక ప్రసిద్ధుడైన నటుడు ప్రతిభావంతంగా వ్యాఖ్యానిస్తూ ఉంటే "ఏయ్. నువ్వు డబ్బు తీసుకున్నా"వని అరవాలనిపించుతుంది. రాళ్ళనీ, రాతిగుండెలనీ కరిగించగల రాగాలాపన సాగిస్తున్న వైణికుణ్ణి చూసి అతని వేళ్ళు కూడా ధనస్పర్శవల్ల మలినమైపోయినవే కదా అని బాధపడతాను. ఏప్రదర్శనానికి వెళ్ళినా నేను కొన్న టిక్కెట్టు నా గుండెల్లో బాకులాగ గుచ్చుకునే ఉంటుంది.

ఈ బెడదలేవీ లేక, ఈ ఆలోచనలేవీ లేక అందరూ ఎంత తృప్తిగా నిశ్చింతగా బతికేస్తున్నారో! అందుకే నాకనిపించుతుంది. నేను ఎందుకు చచ్చిపోవాలి? ఎందువల్ల ఆ మోటారు కారులో పోతూన్న మొద్దబ్బాయి. గంగిరెద్దులాగ తయారయి సినిమాకో, షికారుకో వెడుతున్నవాడు చచ్చిపోకూడదు? ఎందువల్ల ఆ సిగరెట్టు కాల్చుతూ, చేతికర్ర తిప్పుతూ క్లబ్బు వరండాలో పచారు చేస్తున్న, లంచాలు తినడంలో, తినిపించడంలో ప్రత్యేకత వహించిన ఆ పెద్దమనిషి చచ్చిపోకూడదు? ఎందువల్ల ఆ బనారసు చీర కట్టుకున్న, బంగారం పెట్టుకున్న, ఒళ్ళంతా అన్ని దిక్కులా బలిసి, ఆడవాళ్ళ సభలో ఆగిపోయే ఇంగ్లీషులో ఉపన్యాసం చేయబోతూన్న యువతీ రత్నం మరణించ కూడదు?

ఓహో! ఇవి వ్యర్థాలోచనలని భావించవద్దు నేస్తం! నేనూ నీలాగే లోకాన్ని చదువుకుంటున్నాను. నిర్ధనులంతా, నిమ్నజాతులంతా, వాళ్ళ బతుకుతో వాళ్ళు తృప్తిపడుతున్నారనీ, చేసిన పాపం అనుభవిస్తున్నారనీ, అసలు వాళ్ళకి ఆత్మలే లేవనీ, ఈ కొత్త రచయితలూ, కొత్త నాయకులూ బయలుదేరి వాళ్ళకి లేనిపోని ఆశలు కల్పించి, వాళ్ళలో అశాంతి రేగించి తిరుగుబాటు పురికొల్పుతున్నారనీ అంటూన్న చవకరకం విమర్శలు పెట్టనక్కరలేదు. అసలు మన అభిప్రాయాలను వాళ్ళ మనస్సులలో ప్రవేశపెట్టడం సరికదా ఇవన్నీ వాళ్ళ హృదయాలలో, నోరులేని వాళ్ళ జీవితాలలో అంతర్గర్భితంగా ఉన్న ఊహలే బైటికి రాలేక లోపలలోపలనే కుతకుతమని ఉడికిపోతూ ఉన్నవి. మనాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకున్నవాడు ఎవరి పక్షం వహించాలి ఈనాడు? తెలుసును. నా బాధ ఎవరి బాధో నాకు తెలుసును. ఒక ఫ్యాక్టరీలో కూలీ, ... కుర్రాడు, వర్తకుడి దగ్గర గుమాస్తా, వడ్రంగి దగ్గిర పని నేర్చుకుంటున్న ...యి, హోటేల్‌లో పనివాడు, చాలీచాలని జీతం తెచ్చుకుంటూన్న బ్యాంకు గుమాస్తా, ఎల్లెటూళ్ళో బడిపంతులు, నాటకాల్లో చిల్లరవేషాలు వేసేవాడు, ముద్రాక్షరశాలలో అచ్చుకూర్చేవాడు-ఓహో. ఇంకా ఉదాహరణలు గుణించడ మెందుకు - బస్సు స్టాండులు, రైలు స్టేషన్లవద్ద బరువులు మోసేవాడు. పొలాలలో పాలికాపు, పట్టణాలలో కాలవలు తుడిచేవాడు, దారిపక్క భిక్షువు. వైద్యశాలలో రోగి, గుడిసెలో ముసిలమ్మి, (ఆహా, స్త్రీలోకంలో ఉదాహరణలు స్మరిస్తే చెయ్యి వణుకుతోంది. పురుషులదేం కష్టం? కష్టాలనీ, కష్టాల

సహనాన్నీ చెప్పాలంటే స్త్రీలని స్మరించు) ఇప్పుడే చచ్చిపోయిన బిడ్డని చేతుల్లో పెట్టుకున్న పదహారేళ్ళ బాలెంతరాలు, మగడు చచ్చిపోయాడని టెలిగ్రాము వస్తే ఏడుస్తూ కూర్చున్న ఇల్లాలు, వృద్ధాప్యం మీదపడినా, చాకిరీ చెయ్యకపోతే దినం వెళ్ళని దీనురాలు. నీళ్లు తోడుతూ అంట్లు తోముతూ బతికే దాసీది. గతిలేక శరీరాన్ని అమ్ముకొనే వేశ్య, వద్దువద్దు ఇక చాలును. ఎవరు నన్నర్థం చేసుకుంటారో ఎందుకు వేరే చెప్పడం?

ఓహో? అభినవ బుద్ధుడా! ఈ యాతనా ప్రాణాలకు నిర్వాణం సంపాదించడానికా నీ ప్రాణాలు తీసుకుంటున్నావు? ఏ లోకాలకి పోయి, ఏ దేవతల ముందు వాదిస్తావు వీళ్ళకి న్యాయం ఇమ్మని? జీవించు. బతికి ఉండి వీళ్ళకేదైనా తరుణోపాయం ఆలోచించు. ప్రాణాలు నిలుపుకొని వీళ్ళ పక్షాన్ని పోరాడు.

వ్యర్థంగా చచ్చిపోతున్నానా? వీళ్ళనంతా చూస్తూ మరణిస్తున్నానా? ఏమీ చెయ్యలేక నిష్క్రమిస్తున్నానా నేను? మరి ఏమి చేస్తున్నా నా చుట్టూ వెయ్యిరహస్యపు కళ్లు! ఏం చెయ్యాలనుకున్నా ఇదిగో నా వెనకనే ఒక సి.ఐ.డి. ఇదిగో వారంటు! ఇదిగో చెరసాల! ఇదిగో ఉరికొయ్య! మాటకి సంకెళ్ళు. చేతకి నిరోధం. గ్రంథాలకి నిషేధం. ఎన్ని లోపాలున్నా ఈ పద్ధతిని అనుసరించ వలసిందే! కాదని ప్రతిఘటిస్తే వజ్రముష్టితో అశనిపాతం! ఈ సంఘర్షణ హెచ్చిపోయి. కలవారికీ లేనివారికీ తెగతెంపులు జరిగే సంగ్రామంలో, స్పెయిన్‌లో, చీనాలో, అదే యాతత్ర్పపంచంలో విజృంభించినప్పుడు ఇవిగో మరఫిరంగులు! ఇవిగో బాంబర్ విమానాలు! ఇదిగో అగ్నివర్షం! ఇదిగో మృత్యువు! ఇదిగో వినాశనం!

మానవుని మంచితనం గురించి పదేపదే నువ్వు చెబుతావుగాని మనుష్యుడిలో ఎంత కల్మషం అణగిఉందో చూడమంటావా? ఔను. ఈ మోసాలు, అబద్ధాలు, అనుమానాలు, హత్యలు ఏ పోలీస్‌స్టేషన్‌కి. ఏ క్రిమినల్ కోర్టుకి వెళ్ళినా స్పష్టంగా కనబడతాయి! అమ్మయ్యో! మానవులలో ఎంత దుర్మార్గులున్నారో? వీళ్ళని శిక్షించకపోతే మరి వీళ్ళని పట్టపగ్గాలుంటాయా?

ఔనౌను. దగాకోరులని సంఘం నిరసించిన వాళ్ళని నేనెరుగుదును. కాని వాళ్ళ పాపానికి నీకూ, నాకూ, సంఘం మొత్తానికీ ఎంత బాధ్యత ఉన్నదో గుర్తించావా? అధోగతిలో వాళ్లు కొట్టుకుపోతూ ఉంటే అందరూ ఒక తన్నుతన్ని. ఒక రాయి విసిరేవాళ్ళేకాని ఆ పతితులను ఉద్ధరించాలన్న ఆసక్తి చూపిస్తున్న వాళ్ళెందరు? వాళ్ళ పరిస్థితులన మనఃస్థితులనూ జాగ్రత్తగా గమనించి, అర్థం చేసుకుని బాగుచెయ్యవద్దా! ఈ ప్రవర్త ఒక విధమైన సాంఘిక రోగాలే కావా? వీటిని మన బుద్ధివల్ల చికిత్స చేసుకోలేమ

అందుకే నేను బతకవలసిన అవసరం ఉందంటావుకాదూ? నాలాగే ఆ వ్యక్తులున్నారు. వారికో సంఘం ఉంది. ఒక సిద్ధాంతం, ఒక శిక్షణా, ఒక క ఉంది. ప్రపంచం అంతటా ఇట్టి సంఘాలుండడమేకాక, నువ్వు కలలు ఆశయాలను మానవులందరికోసం సాధించడమే దీక్షగాగల మహత్తరదేశం ఒక కాబట్టి నాకు నిస్పృహ అనవసరం అంటావు? ఇది నిస్పృహ కాదు నేస్తం! బోధపరచలేను. "మృత్యు ప్రేమ" అని దీనికో ముద్దుపేరు పెట్టనా? ఔను. నేను జీవితాన్ని నిరాకరించగలిగినంత గాఢంగా మరణాన్ని ప్రేమిస్తున్నాను. నా నిష్క్రమణ ఒక నిష్ఫలకృత్యం కాదు. అదో కొత్తప్రవేశం. మరో కొత్త ప్రారంభం. అదొక సవాలు. ఒక సాధనం. ఒక తిరుగుబాటు. ఒక దృఢ నిశ్చయం.

అరే! పన్నెండు కావస్తోంది.

వీడ్కోలు తీసుకుంటున్నా. మళ్ళా వస్తాను. నాకు తెలుసును. రమణీయమైన ఈ భూలోకానికి నా ఆశీర్వాదం. నదులవల్ల, పర్వతాలవల్ల, అరణ్యాలవల్ల, మహానగరాల వల్ల, పల్లెటూళ్ళవల్ల సౌందర్యాన్ని ప్రదర్శిస్తూ భూలోకం అభ్యున్నతి కాంచునుగాక! ఆనకట్టలతో, వంతెనలతో, వేనవేల మైళ్ళ ఇనుప దారులతో, విమానాలతో, శాస్త్రపరిశోధన శాలలతో, టెలిగ్రాఫ్, రేడియో శ్రవణాలతో, సినిమా, టెలివిజన్ నేత్రాలతో మానవత్వం విజృంభించును గాక. లోకమంతా ఏక కుటుంబమై తన విధిని తానే నిర్ణయించుకోగల శక్తిని మానవుడు సాధించునుగాక!

సరిగ్గా పన్నెండయిం దిప్పుడు.

## స్వ ర్గ ం

కుడిచేతిలో కలం రాస్తూనే ఉంది. ఎడంచేత్తో క్లోరోఫారం సీసా మూ చూస్తూన్నాను. గడియారం రెండు ముళ్లూ కలుసుకున్నాయి. వీటిని నేను విడిపోనివ్వను. ఈ క్షణాల్ని ఇక్కడే నిలబెట్టేస్తాను. ఈ క్షణంకోసం ఆరునెలలనుండి ఆరాటపడుతున్నాను. దీని విచిత్రమైన ప్రవర్తనని అర్థం చేసుకుందామని ప్రయత్నించాను. శాశ్వతంగా దీన్నిప్పుడు ఆక్రమిస్తాను. ఏంచేస్తున్నాను? క్లోరోఫారం వాసన చూస్తున్నాను. ఇక్కడే వుండికూడా ఎక్కడికో పోతున్నాను. ఇదేమిటి? ఎటు పోతున్నాను? ఒక్కమారే అనేక దిక్కులుగా ప్రయాణం చేస్తున్నానేమిటి? ఈ కొవ్వొతి దీపం! ఆకాశమంత అయిపోయి గారడీ శాలువలాగ కప్పేస్తోంది నన్ను. గడియారం కనబడలేదు. మౌనం ప్రవహిస్తోంది. ఇదేం. ఇలా కరిగిపోతున్నాను! సరిహద్దులు దాటిపోతున్నాను. ఎన్ని నిచ్చెనలో! అడ్డుగా, నిలువుగా, గళ్లు గళ్లుగా! పరుగెత్తుతున్న జామెట్రీ. కలుసుకొంటూన్న సమానాంతర రేఖలు, సముద్రాకాశాల సంగీతం. జ్ఞాపకాలతో కలిసి స్వప్నాలు చేసే నాట్యం, నిరీశ్వర సాక్షాత్కారం.

నిరాధారంగా, నిరాకారంగా తేలిపోతున్నాను. నిరీశ్వరుడితో నిండిపోతున్నాను. ఈశ్వరుడి ఇంకోవేపుకి పోతున్నాను. పరాజయాలకాల్బలాలతో పరాభవాల నౌకాదళాలతో, అనుమానాల విమానాళ్లతో దండయాత్ర సాగిస్తున్నాను. "దేవుడు లేడు" అని నేనన్నప్పుడు నా ఉద్దేశం "దేవుడు ఉన్నాడు" అని. ఇది ఎవరి కర్థం అవుతుంది? నా "ఔను"కి. "కా"దని. నా "ఉంది"కి"లే"దని అర్థం ఉందనీ, లేదనీ, ఉండి లేదనీ, లేక ఉందనీ ఎలా నచ్చచెప్పగలను?

అర్ధరాత్రి యిప్పుడు! అయితే ఈ సూర్యుడేమిటి? *(కొవ్వొత్తి వెలుగంటారు నాకు ...ను.)*

ఇది మరణం అంటారు. కాదంటాను నేను. ఎప్పుడూ నేను పెడసరం గానే ...నేం? అందరూ వద్దంటున్న పనులే చేస్తానేం? ఎప్పుడూ ఇంకోవేపు చూస్తానేం? *(...కి ఇంకోవేపు వున్నది కాబట్టి)* అన్నిటికన్నా విశేషం : నిరీశ్వరుడే ప్రత్యక్షమై "నేనున్నాను" ...ంటే నమ్మకం లేకుండానే నమ్మకాన్ని ప్రకటిస్తాను.

ఒకచోట గురజాడ ఇలా అన్నాడు.

*"దేవతలతో జోడు కూడితిక్మ్‌ని*
*రక్కసులతో కూడి ఆడితిక్మి*
*కొత్త మిన్కుల తెలివి పటిమను*
*మంచి చెడ్డల మార్పితిన్!"*

ప్రస్తుతం నేను చేస్తున్న పనికూడా అదే. అంచుల దగ్గిర అంతా యాదృచ్ఛికమే! అక్కడ పరమాణువుల ప్రవర్తననిగాని, జీవాణువుల స్వభావాన్నిగాని, యిదమిత్థమని నిర్ణయించలేము. ఇదో కఠోరమైన గందరగోళమైన బీజగణిత సమస్య. ధన ఋణ సంజ్ఞలనుబట్టి బ్రాకెట్లను విప్పుకుంటూ వెళ్లాలి. ఎక్కడ ఒక్క సంజ్ఞ తప్పినా లెక్కంతా తప్పుతుంది.

-(a-a)+(b-b)-(c-c)+(d-d)....=?

-(ఔను - కాదు)+(మంచి - చెడు)-(వెలుగు - చీకటి)+(చావు - బదుకు).... = ?

ఈ లెక్కని ఎందరు ఎన్నిమార్లు చేస్తే అన్ని జవాబులు వస్తాయి. అందుకే ఎవరి ఆవరణల మధ్య వాళ్లు ఇమిడిపోతారు. తమకు వెలుపల ఉన్న సంజ్ఞ ఏమిటో కూడా వాళ్ళకి తెలియదు. అన్ని ఆవరణలకీ వెలపల ఏ సంజ్ఞ ఉందో అసలే తెలియదు. మొత్తం మీద ఈ లెక్కకి జవాబు సున్నా అనిగాని, ఒకటి అనిగాని, రెండు అనిగాని నిర్ధారణగా ఎవరూ చెప్పలేరు.

- (1+1) = - 2

+ (1+1) = + 2, అని లెక్కచేసి, ద్వైతులు రెండంటారు.

- (1-1) = 0

+ (1-1) = 0 అని లెక్కచేసి, మిథ్యావాదులు సున్నా అంటారు.

నే నొక్కణ్ణే ఏ తర్కానికీ లొంగకుండా, వెలుపలి సంజ్ఞ ఏదయినా లక్ష్యపెట్టకండా.

1-1 = 1

1+1 = 1 అని అనడం మానలేదు.

అంటే దీని అర్థం; ఔను/కాదు, మంచి/చెడ్డ, వెలుగు/చీకటి, చావు/బ్రతుకు, మనిషి/దేవుడు, అంతా ఒకటే అని. ఇందు మూలంగా శూన్యం మీదనూ, అనేకం మీదను ఏకాంకికిగల ఆధిక్యాన్ని ఉగ్గడిస్తున్నాను. ఈ ఏకం ఎవరో కాదు. మానవుడు. అతడే సత్యం. అతడే నిత్యం. అతడే ఈశ్వరుడు.

జీవించినా, మరణించినా నేను నేనే కాబట్టి జీవితం సుఖమనీ, మరణం దుఃఖమనీ, జీవితం ,బానిసతనం. మరణం స్వాతంత్ర్యం అనిగాని వాదించడం మానేస్తున్నాను. పరస్పర ప్రేమవల్ల మానవులంతా సమానులవుతారు. ప్రతిమనిషీ రెండోవాడిలో తన్నూ, దేవుణ్ణీ చూస్తాడు కాబట్టి ప్రపంచంలో వైషమ్యాలకూ, వైక్లబ్యాలకూ తావుండదు.

ఇదీ నా ఆలోచనల గమ్యస్థానం. భూత, వర్తమాన, భవిష్యత్కాలాలను ఒకే క్షణ ముద్దచేసి నేను కల్పించుకున్న. నేను నివసిస్తున్న స్వర్గం. ఇక్కడ నాకు ఒంటరితనం నాతోబాటు ఆమెకూడా అనంతంగా తేలిపోతోంది. ఆమె యెక్కడో, నేనెక్కడో అను నన్ను కలుసుకోవడానికి ఆమె మరణించనక్కరలేదు. ఇద్దరం కలిసే ఇక్కడలో. ఇ ఈదుకుపోతున్నాము. రెండు స్వప్నాలు. రెండు మృత కళేబరాలు. రెండు కళేబరా దీపాలు. *(ప్రమిదా, కొవ్వొత్తి)* ఇంకా రెండేమిటి? ఒకే ఒక తనం. ఒకే రెం లేకపోవడం, ఒకే నిండుతనం.

ఓహో! సత్యాసత్యాల కవతల సాఫల్యం! నిత్యా నిత్యాలను మించిన సాంగత్య మానవ మనశ్శాఖలమీద పుష్పించిన సంగీతం! అనేక స్థలాలలో ఏకకాలమే జీవిస్తున్న అనుభవం! ఏకకాలంలో ఉండడాన్నీ, ఉండకపోవడాన్నీ సాధించే స్వాతంత్ర్యం. ఇది నా కామ్యం! ఇది నా గమ్యం!!!! ఇదీ నా స్వర్గం.

ముద్రణ : తేదీ ?